
కథ

# మరుగుజ్జు

అభిమన్యు



'ఆకాశం' అనే మైదానంలోకి సూర్యుడు ఇంకా రాలేదు... చలికి జడిసి కాబోలు... నేను నడుస్తున్నాను... శరీరం చిన్నగా చెమట పడ్తోంది. వెనక్కి తిరిగి చూసాను... ఎవ్వరూ లేరు. తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను.

నాకు ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు సెక్యూరిటీగా ఉంటారు. వారి చేతుల్లో 'గన్స్' చూసాక నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంది "వేరే యమ భటులు ఎందుకు...? వీరే నా పాలిట యమదూతలని"

నిజం చెప్పొద్దూ... నేను మంత్రిని. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజాల్ని రక్షించాల్సిన మంత్రిని. మరి... నా రక్షణకి ఈ గన్‌మేన్‌లు... చిత్రంగా ఉంది కదూ...!

నడుస్తూ... నడుస్తూ అటు చూసాను. అక్కడ చెట్టు క్రింద గుడిసెలో ఓ కుటుంబం నివసిస్తోంది. చెట్టు కొమ్మకి చిరిగిన చీర ఊయల కట్టి ఉంది. అందులో పసి బిడ్డ నిద్రపోతూంది. పక్కన రిక్షా. ఆ చిన్ని గుడిసెలో రిక్షావాడు. వాడి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు. ఇలాంటి గుడిసెలు చాలా ఉన్నాయి. కొన్ని లక్షల మంది ఇలాంటి గుడిసెల్లోనే ఎండకి ఎండుతూ... వానకి తడుస్తూ బ్రతుకుతున్నారు.

ఈ స్వతంత్ర భారతదేశంలో ప్రతి సంవత్సరం ఇన్నేసి లక్షలు... అన్నేసి లక్షలు పక్కా గృహాలు నిర్మిస్తున్నాం. అవన్నీ ఏమైపోతున్నాయి...? ఎవరి చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి..?

అయ్యో! నా మతి మండ... ఈ ప్రశ్నలకి- సమాధానం నేను చెప్పాలి గాని... నేనే వేస్తున్నానేమిటి...!?

వాకింగ్ పూర్తి చేసుకొని ఇంటికి వచ్చేసరికి నా సెక్యూరిటి "సార్... సార్..." అంటూ గాభరాగా వచ్చారు... "నేనేమైపోయానోనని... ఏ నక్సలైట్లు అయినా కిడ్నాప్ చేసారేమోనని..."

"ఏమీ కాలేదు... ఏమీ కాదు... మీరు టెన్షన్‌తో నాకు టెన్షన్ పెట్టొద్దు..." అని కసురుకున్నాను.

కాఫీ సిప్ చేస్తూంటే నా బావమరిది వచ్చాడు. ఎవరికో మెడికల్ సీటు కావాలంట...! నా ముందు దేభ్య ముఖం వేసుకొని నిల్చున్నాడు. వాడొట్టి వెధవ. ఆ విషయం వాడి అక్కను చేసుకోక ముందే తెలుసు.

నేను కాలేజిలో చదివే రోజుల్లో వాడి అక్కను ప్రేమించాను. ఆమె చాలా అందంగా, నాజూకుగా ఉండేది. "నేను నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టి నువ్వు కూడా నన్ను ప్రేమించు..." అని ఆమె వెంట రాత్రనక, పగలనక జీతంలేని గార్డ్‌లా తిరిగాను. నేను ఇలా తిరుగుతున్నానని నా బావమరిది వెధవకి తెలిసి నన్ను రౌడీలతో కొట్టించాడు. ఆ తర్వాత మా ఇద్దరి మధ్య ముష్టి యుద్ధాలు, వీధి పోరాటాలు జరిగాయి. నిజ

మైన ప్రేమకు ఇవేవీ ప్రతిబంధకాలు కావని... వాడి అక్కను లేపుకుపోయి పెళ్ళి చేసుకున్నాను.

"బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే ఆ కుర్రాడికి మెడికల్‌లో సీటు వస్తాది కదా...!"

"నాకు తెలియదా... బావా!" అని రాగం తీసాడు.

నిజమే కదూ...! అయినా ఇలా ఇంజినీరింగ్ సీట్లకి, మెడికల్ సీట్లకి రికమెండ్ చేస్తూ పోతూంటే రేపు వీళ్ళు జనాన్ని బ్రతకనిస్తారా...!?

ఇలా బావమరిది చెప్పాడని, తోడల్లుడు చెప్పాడని మెదడు లేని వెధవలందరికీ సీట్లు ఇప్పించేస్తే... మరి మెదడు ఉన్న మెరిట్ వాళ్ళ గతేం కాను!?

అవునూ... నేను ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను...!? అక్కడికేదో మా అబ్బాయికి ఇంజినీరింగ్‌లో, మా అమ్మాయికి యం.బి.బి.ఎస్.లో మెరిట్ వల్లనే సీట్లు వచ్చినట్టు... ఫోజు కాకపోతేనూ...!

నా భార్య ఫోన్‌లో ఎవరినో వాయిస్తోంది. మినిష్టర్ భార్య గదా... ఆ మాత్రం లెవిల్ మెయిన్‌టైన్ చేయకపోతే ఎలా... అవతలి వ్యక్తి డి.యస్.పి. ఆ మధ్య నా మరదలు– అదే నా భార్య చెల్లెలు ఇంట్లో దొంగలు పడ్డారు. వాళ్ళు ఖరీదైన దొంగల్లా ఉన్నారు. కేవలం నగలు, డబ్బు మాత్రమే దోచుకుపోయారు.


"మీరు కాస్త గట్టిగా చెప్పండి..." అంది నా భార్య. 'గట్టిగా' అంటే... ఏ నక్సలైట్ల ఏరియాకో ట్రాన్స్‌ఫర్ చేయించేస్తానని బెదిరించడం లాంటిది.

ఆ మధ్య ఎస్.ఐ. ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయారు. దోమకి నీవు, నేను అనే బేధం ఏవుంది...!? దొంగకీ అంతే...!

అసలు మనిషి ఎందుకు ఋజువర్తన వదిలి పెడదారిన పోతున్నాడు. తాను చేస్తున్నది అన్యాయం అని, శిక్ష ఉంటుందని తెలిసి కూడా వక్రమార్గాన పోతున్నాడు.

దొంగను పట్టుకోవలసిన పోలీసు దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నాడు, చేయిస్తున్నాడు. దొంగతో కలిసి వాటాలు పంచుకుంటున్నాడు. ప్రజల మాన ప్రాణాలు కాపాడవలసిన ఈ పోలీసోళ్ళు కంచె చేను మేసిన చందాన తయారయ్యారు.

అవునూ... నేనేమిటి ఇలా ఆలోచిస్తున్నాను...!? ఈ పోలీసోళ్లు నన్ను కాపాడుతున్నారు. నావాళ్ళను కాపాడుతున్నారు. నా ఇంటిని కాపాడుతున్నారు. నా



కుక్కపిల్లని కాపాడుతున్నారు. ఆc! ప్రజలు ఎవరు? గొర్రెలు... వాళ్ళకెందుకు రక్షణ...? వాళ్ళచేత ఎన్నుకో బడిన మాకు కావాలి రక్షణ. అందుకు గదా వాళ్ళు లాకప్‌డెత్‌లు చేసినా, ఆడ పడుచులపై అత్యాచా రాలు చేసినా, యువతను తీవ్రవాదులని, నక్సలైట్లని చంపినా ఊరుకుంటాం... సమర్థిస్తాం...

తీరిగ్గా పదకొండు గంటలకి పార్టీ ఆఫీసుకి బయ లుదేరుతుంటే నా కారును కొంతమంది అడ్డగిం చారు. కొంత మంది ఏమిటీ చాలా మంది ఉన్నారు. విషయం ఏమిటంటే ఈ మధ్యనే ఓ ఫైనాన్స్ కంపెని అర్థాంతరంగా ఓ అర్ధరాత్రి వేళ బోర్డు తిప్పేసింది. దగ్గిర దగ్గిర పది కోట్లకి ప్రజల నెత్తిన శఠగోపం పెట్టింది. ఆ ఫైనాన్స్ కంపెని నా వియ్యంకుడిదని ప్రజల నమ్మకం. అది నిజమే. అందుకే నేను అంటాను 'ఈ ప్రజలు ఆల్సేషియన్ డాగ్స్' అని.

మనిషి నమ్మకం మీద తియ్యటి సమ్మెట పోటు అంటే ఇదే. రూపాయి బిళ్ళ పడిపోతే అది దొరికే వరకూ వెతుకుతాం. అలాంటిది కష్టార్జితం... కూతురు పెళ్లి కోసం, కొడుకు చదువు కోసం దాచిన సొమ్ము అన్యాయంగా ఎవరో దోచుకుపోతే ఎవరు మాత్రం చూస్తూ ఊరుకుంటారు. వాళ్లను చూస్తుంటే నా గుండె తరుక్కు పోతుంది. ఈ సామాన్య మాన వుడు ఎన్ని రకాలుగా... ఎంతమంది చేతుల్లో అన్యా యమై పోతున్నాడో కదా!

అవునూ... నేను ఇలా ఆలోచించడం తగదేమో...! చిన్న చేపను పెద్దచేప... దాన్ని ఇంకా పెద్ద చేప తినడం అనేది వేట నీతి. దౌర్జన్యం చేసి దోచుకోవడం అనేది పాత పద్ధతి. శాంత వచనాలతో అవతలి వ్యక్తిని పల్టీ కొట్టించడం అనేది న్యూ టెక్నిక్. ఇలాంటి టెక్నిక్‌లు మా రాజకీయనాయకులకు వెన్నతో పెట్టిన విద్య.

మనిషికి ఆశ ఉండడంలో తప్పు లేదు. అయితే రాత్రికి రాత్రి లక్షాధికారి అయిపోవాలన్న దురాశ ప్రజల్లో బాగా పెరిగిపోయింది. కాస్త తెలివైనవాడు ఈ 'బలహీనతని క్యాష్ చేసుకుంటున్నాడు. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పబ్లిక్ మెమరీ వెరీ షార్ట్'...

ఈ గొడవంతా చూసుకొని ఇంటికి వచ్చేసరికి ఊహించని సంఘటన ఎదురైంది. నా కూతురు సోఫాలో కూర్చోని ఏడుస్తూంది. నా భార్య సముదా యిస్తూంది. నన్ను చూసి, నా గుండెల మీద వాలి పోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. నా తల్లికి ఏం కష్టం వచ్చిందో! ఏమో!

నాకు ఇద్దరు పిల్లలు, కొడుకు, కూతురు. కొడుకు ఇంజినీర్ ఆరు సంవత్సరాలు చదివి నా వెంట తిరు గుతుంటాడు. నా రాజకీయ వారసుడు. సెంట్రల్ మినిస్టర్ అమ్మాయితో పెళ్లి నిశ్చయమైంది. కూతుర్ని డాక్టర్ చదివించి డాక్టర్‌కే ఇచ్చి పెళ్ళి చేసాను.

''కట్నం ఇవ్వడం తీసుకోవడం నేరం. ఈ పిశాచిని తరిమివేయండి... దానివలన ఆడపిల్లల తల్లిదండ్రులు బజార్న పడుతున్నారు... ఎంతోమంది ఆడపడుచులు ఈ 'కట్నం' అనే అగ్నికి ఆహుతైపోతున్నారు...'' అని పలుసార్లు వేదిక లెక్కి ఉపన్యసించాను.

కాని, చిత్రం... నా కూతురికి పెద్ద మొత్తంలో డబ్బు, బంగారం, కారు, బంగ్లా కట్నంగా ఇచ్చి పెళ్లి చేసాను. అడపా, దడపా డబ్బు, బంగారం ఇస్తూనే ఉన్నాను. అయినా నా అల్లుడి దాహం తీరడం లేదు. ఇప్పుడు హాస్పిటల్ కట్టాడట డబ్బు కోసం పంపిం చాడు. లేదంటే విడాకులిస్తాడంట...!

'నీ బాబు ప్రజల మీద పడి తెగ సంపాదించేస్తు న్నాడు. కంట్రాక్టర్ల దగ్గర లంచాలు పట్టి, ఫైనాన్స్ కంపెనీలు పెట్టి చాలా గడించాడు. అదంతా ఏం చేసుకుంటాడు...!? చచ్చాక మీదనేసుకొని తగలేసు కుంటాడా...!?' వెళ్ళి డబ్బు అడిగి తీసుకురమ్మనమని నా కూతుర్ని పంపించాడు నా దశమ గ్రహం.

మనిషి తాను సృష్టించిన రూపాయి చుట్టూ తానే తిరుగుతున్నాడు.

నా గదిలో కూర్చోని విస్కీ తాగుతున్నాను. నా మనసు బాగా లేనప్పుడు ఇలా ఒంటరిగా కూర్చోని డ్రింక్ చేయడం నేను ఇష్టపడతాను.

నా భార్య వచ్చి మౌనంగా నా పక్క కూర్చుంది. బాగా ఏడ్చినట్లుంది... ముఖం ఉబ్బింది. ఒకప్పుడు నా భార్య చాలా అందంగా ఉండేది. ఇప్పుడా అందం లేదు... నాజూకు తనం అస్సలే లేదు. శరీరం ఐరావ తంలా పెరిగిపోయింది. ఆమె మొదట్లో నన్ను ప్రేమించేది. ఆ తర్వాత నా సంపాదనను ప్రేమిం చడం ప్రారంభించింది. ఆమె ఒంటినిండా నగలే. ఆ నగలు ఎప్పుడూ తీయదు ఉత్సవ విగ్రహంలా.

''ఏమండీ... మనం ఏం పాపం చేసామండీ...? మన పిల్లల బతుకులు ఇలా తయారయ్యాయి.

''కట్నం ఇవ్వడం. తీసుకోవడం నేరం. ఈ పిశాచిని తరిమివేయండి... దాని వలన ఆడపిల్లల తల్లిదండ్రులు బజార్న పడుతున్నారు... ఎంతోమంది ఆడ పడుచులు ఈ 'కట్నం' అనే అగ్నికి ఆహుతైపోతున్నారు...'' అని పలు సార్లు వేదిక లెక్కి ఉపన్యసించాను.

మనకు బోల్డు డబ్బుంది... పేరు ప్రతిష్టలు ఉన్నాయి... అయినా ఎందుకండీ ఇలా జరిగింది...?'' అంటూ ఏడ్వడం ప్రారంభించింది.

నాకు నవ్వొచ్చింది... 'చేయని పాపం అంటూ ఏమైనా ఉందా' యని.

గంట క్రితమే ఫోను వచ్చింది 'మా అబ్బాయి తాగి జడ్జిగారి అమ్మాయిని అల్లరి పెడ్తుంటే అరెస్ట్ చేసారని'... రక్తం అటువంటిది.

రెండు పెగ్గులు పూర్తయ్యాయి. నేనేమీ మాట్లా డడం లేదని నా భార్య కోపం తెచ్చుకొని వెళ్ళి పోయింది. ఒళ్ళంతా మత్తుగా ఉంది. తల తిప్పి అటు చూసాను. నిలువెత్తు చిత్రపటం. నేనే. ఎవరో అభిమా నంతో గీయించి ఇచ్చారు. దాని పక్కనే అద్దం.

లేచి, ఆ నిలువుటద్దం ముందు నిల్చోని చూసి అదిరిపడ్డాను.

ఇంతటి భారీ శరీరం ఏమైపోయిందో అర్థం కావడం లేదు. ఆ అద్దంలో నేను 'మరుగుజ్జు'లా కని పిస్తున్నాను. తల విదిలించి నన్ను నేను చూసుకు న్నాను. బాగానే ఉన్నాను...!

అద్దం అంటే నాకిష్టం. ఎందుకంటే... ఎవ్వరినైనా, దేనినైనా ఎటువంటి దాపరికం లేకుండా ఉన్నది ఉన్న ట్లుగా చూపించే ఏకైక సాధనం ఈ ప్రపంచంలో ఇదొక్కటే. మరలా అద్దంలోకి చూసాను నా మరు గుజ్జు రూపం మారలేదు. సరికదా... ఎవరెవరో పిడి కిలి బిగించిన చేతులు పైకెత్తి ఏమేమో అంటు న్నారు... నన్ను చూసి నవ్వుతున్నారు... వాళ్ళు ఎవ్వరో కాదు... నాకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు.

నవ్వాను... పెద్దగా నవ్వాను... జీవితంలో మొద టిసారి మనస్ఫూర్తిగా నవ్వుకున్నాను. తాగిన విస్కీ బాగానే పని చేస్తూంది.

నేను మనిషిని. కాదు... కాదు... మంత్రిని. 'మరి మంత్రి మనిషి కాదా...!?' ఏమో...! అలా అయితే రోజూ చూసుకునే అద్దంలో 'మరుగుజ్జు'లా ఎలా కని పిస్తున్నాను? నిజానికి నా అసలు రూపం అదేనా...!?

ఈ ప్రజలు తమ అమూల్యమైన ఓట్లతో నాకు రాజ కీయ జీవితం ఇచ్చారు. వాళ్ళకు ఏదేదో చేస్తానని ప్రమాణం చేసి మంత్రి నయ్యాను. అయితే ప్రజల చేత ఎన్నుకోబడ్డ నేను ఆ ప్రజల మీద పడి బతుకుతు న్నాను. నా కొడుకు ఇంజనీర్. నా కూతురు డాక్టర్. అడ్డ దారిన సీట్లు సంపాదించాను. లక్షలు గడించాను... లంకంత ఇల్లు కట్టాను... ఒక్క రూపాయి ఎవ్వరికీ ఖర్చుపెట్టలేదు. అయితే వాళ్ళమీద పడి లక్షలు ఏరుకు న్నాను. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసాను... విశ్వా సాన్ని సొమ్ము చేసుకున్నాను. ఇదేమిటని అడిగేవాడి నాలుక చీరేసాను: ఇంకా రెచ్చిపోతే ప్రాణం తోడేసాను. అధికారులను కొన్నాను... అవినీతిని పెంచి పోషిస్తు న్నాను... ఇదంతా నా ప్రజల సహకారంతోనే...!

నా కూతురు పెళ్ళికి ముందే ఎవడితోనో తిరిగి కడుపు తెచ్చుకుంది... నా కొడుకు తాగుబోతు, తిరుగు బోతు... ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తాదా...!?

నా పిల్లల జీవితాలు అలా అవ్వడానికి కారణం, ఈ ప్రజలు. ఈ ప్రజల ఉసుర్లు, శాపనార్థాలే...

'తుపాను వచ్చి వెళ్ళాక చూసుకుంటే..'

ఇన్ని లక్షలు, బంగారు, భూములు ఎవరికోసం సంపాదించాను? ఎంత మంది కడుపులు కొట్టానో... ఎంతమంది జీవితాలు నాశనం చేసానో... ఎందుకు? ఎవరి కోసం...!?

ప్రతి క్షణం... ప్రతి దినం అభద్రత... ఎవడు చంపుతాడో... ఎవడు నరుకుతాడోనని భయం... నా సెక్యూరిటీయే నన్ను లేపేయవచ్చు... కంటి మీద కునుకు ఉండదు. ప్రశాంతంగా నిద్ర పోయి ఎన్ని సంవత్సరాలైందో...! నాకన్నా ఆ చెట్టు క్రింద నిద్ర పోయే రిక్షావాడు నయం... అద్దం వైపు చూసాను... నా మరుగుజ్జు రూపం మారలేదు. చిన్నగా నవ్వుకు న్నాను. మారాల్సింది రూపం కాదు... నేను.. నా ఆలోచనలు.. నిజానికి ఈ ప్రజల దృష్టిలో మేము ఎప్పుడూ మరుగుజ్జులమేమో...!?

***

సంవత్సరం గడిచింది... అన్యాయంగా సంపాదిం చిన సొమ్ముతో పేద ప్రజలకి హాస్పిటల్, స్కూలు కట్టి స్తున్నాను. ఎటువంటి కట్న కానుకలు ఆశించకుండా నా కొడుక్కి మధ్యతరగతి సంబంధం చేసాను. సెక్యూరిటీని వెనక్కి పంపించేసాను. మంత్రిని అనే గర్వం, పొగరు వదులుకున్నాను. నా కూతురు కాపురం చక్కబడింది. ఇప్పుడు ప్రశాంతంగా గుండెల మీద చేతులు వేసుకొని నిద్ర పోగలుగుతున్నాను.